# నల్గొండజిల్లా రైతుల సమస్యలు - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

**తెలంగాణ** రాష్ట్రంలో గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం వర్షాలు అదునుకు కురవక తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు వేసిన పంటలు ప్రధానంగా పత్తి చేలు ఎండిపోయి 80% రైతులకు ఎకరాకు 2-3 క్వింటాళ్ళు, 20% రైతులకు 5-6 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. సాగర్ ప్రాజెక్టులో నీళ్ళు లేక, ఎడమకాలువ కింద నీరు వదలక వేలాది ఎకరాల పంట భూములు బీడు భూములుగా మారాయి. బావులు, బోర్లు, వాగుల వెంట ఉన్న రైతులు మాత్రమే ఏదోమేరకు సాగుచేశారు. దోమపోటు, ఎర్రతెగులు వలన చాలామంది రైతులు పంట నష్టపోయి ఎకరాకు 20-25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. కొద్దో గొప్పో పండించిన పంటతో పెట్టుబడులు కూడా తీరక, ఎలా బ్రతకాలని రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

పండిన పంటకు గిట్టుబాటు ధరలేదు. గ్రామాలలో వ్యాపారస్తులు రైతులకు అప్పుపెట్టి పత్తి విత్తనాలు ప్యాకెట్టు ధర రూ॥ 1000/-లు, డి.ఎ.పి. రూ॥ 1400/-లు, నూటికి నెల ఒక్కంటికి వడ్డీ, అన్నిరకాల మందులకు అధికరేట్లు వేయటమేగాక, పండిన పంటకు ధర లేదని ఈ వ్యాపారస్తులే క్వింటా పత్తి రూ॥ 3200/-ల నుండి ఈ నెలలో 3800 వరకు కొనుగోలు చేసి అప్పు కిందికి జమచేసుకుంటున్నారు. పంట వచ్చిన సమయంలో ప్రభుత్వం సి.సి.ఐ. కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. 2 నెలల తరువాత ఏర్పాటుచేసినా, సి.సి.ఐ. వారు దళారులతో, కంపెనీలతో కుమ్మక్కై, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర ఇవ్వలేదు; 15 రోజులైనా డబ్బు ఇవ్వరు. 2013 సంవత్సరంలో క్వింటా పత్తి ధర 4000 నుండి 4500-5000 వరకు వున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 3000 నుండి 4000ల లోపు ధరకు రైతులు అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది. రైతులు పండించిన పంట 'కొనబోతే కొర్వి అమ్మబోతే అడవి' లాగా తయారయింది. వ్యవసాయ మార్కెట్‌లో రైతులను దోచే మార్కెట్లు - పత్తిక్వింటాకు 5 కిలోల తరుగు, నూటికి 2.50 కమీషన్, క్వింటాకు రూ॥ 60/- రవాణా చార్జి, బోరెం చార్జీ 50/- ఈ విధంగా 3000 నుండి 3400 వరకు ధర నిర్ణయిస్తూ దోచుకుంటున్నారు. ప్రభుత్వం, అధికారులు దళారులతో కుమ్మక్కై ప్రేక్షకుల పాత్ర పోషిస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం; కేంద్రంలో పాలనసాగించిన యుపిఏ, ప్రస్తుత ఎన్‌డిఏల తీరులోనే తెలంగాణారాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వపాలన సాగుతోంది. బంగారు తెలంగాణ అంటూ భూ బకాసురులకు, బడా పెట్టుబడిదారులకు, భూస్వాములకు, బడా కంపెనీలకు సేవచేస్తూ రైతులను, కార్మికులను, విద్యార్థులను మాయమాటలతో దగా చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ గుళ్ళూ గోపురాలకు వేలాది ఎకరాల భూములు, వందల కోట్ల రూపాయలు కేటాయిస్తూ, చండీయాగాలు నిర్వహిస్తూ, ఇదంతా ప్రజల మేలుకోసమేనని నమ్మబలుకుతున్నాడు. దేవుడు తనకు వేలాది ఎకరాల భూమి ఇవ్వమని అడిగాడా? వందల కోట్ల రూపాయలు ఇవ్వమన్నాడా? ప్రజలలో మూఢనమ్మకాలను పెంచిపోషిస్తూ బడా పెట్టుబడి దారులకు, బహుళజాతి కంపెనీలకు వేలాది ఎకరాల భూములు, నీటి సదుపాయం, కరెంటు రాయితీలు ఇస్తూన్న కేసీఆర్, నరేంద్రమోడీలు పంటలకు మద్దతు ధర పెంచకుండా, రైతులను వ్యవసాయం నుండి దూరంచేసి కార్పొరేటు కంపెనీలకు వ్యవసాయాన్ని అప్పగించి రైతులను వారి భూముల్లోనే కూలీలుగా మార్చే విధానాలను కుట్రపూరితంగా అమలుచేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్‌హౌస్, పాలిహౌస్ కూరగాయల సాగు ఎకరానికి 38 లక్షల ఖర్చు అవుతుంది. దీనిలో 25% రైతు కట్టాలి. 9 లక్షల రూపాయలు రైతు వాటా, రైతు కట్టలేడు. ఈ పథకం భూస్వాములకు, ధనిక రైతుకు ఉపయోగపడేదే. రైతుల రుణమాఫీ ఒకేసారి చేయకుండా నాలుగు వాయిదాలు పెట్టడంతో, బ్యాంకుల్లో రైతు అప్పుతీరదు. కొత్తగా అప్పుదొరకదు. ఇదేనా రైతుసంక్షేమం? రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర పెంచమని కేంద్రాన్ని ఏనాడూ కేసీఆర్ కోరలేదు. కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం రైతులపై పన్నులు వేయటం, మరణించిన వారికి పథకాలు పెట్టటంతప్ప, బ్రతికున్న ప్రజలకు మేలు చేసేటందుకు కేసీఆర్‌కు, నరేంద్రమోడికి చేతులు రావు. నల్లగొండ జిల్లా మొత్తం కరువు తీవ్రంగా వున్నా, 22 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారు. మండల కేంద్రంలో ఉన్న వాతావరణ కేంద్రం ఆధారంగా కరువు మండలాలను నిర్ణయించటం అశాస్త్రీయం. ఒక గ్రామములో ఒకవైపు వర్షం వుంటే ఇంకోవైపు వుండదు. గ్రామములో రైతుల సర్వే నెంబర్ల వారీగా పంట నష్టం శాస్త్రీయంగా రూపొందించాలని రైతుకూలీసంఘం డిమాండ్ చేస్తున్నది.

**(ఆందోళనారిపోర్టు లో)**

ooooo